

26న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఈనెల 26న ఉంటుందని, ఏర్పాట్లలో ఏలాంటి లోటు రానీయకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన శింగనమల నియోజకవర్గం లోని నార్పల మండల కేంద్రంలో ముఖ్యమంత్రి పాల్గొంటున్న జగనన్న వసతి దీవెన కార్యక్రమం ఖరారైన నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటు రానీయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో పాటు పోలీసు అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలని అనంతపురం ఆర్డీవో మధుసూదన్‌కు సూచించారు.

మెప్మాలో అవినీతి కంపు..!



మెప్మా కార్యాలయం ఎదుట తీర్మానాలను రాసుకుంటున్న మహిళా సంఘాల ప్రతినిధులు

హిందూపురం పులపాలక సంఘంలోని పేదరిక నిర్మూలన సంస్థ విభాగంలో అవినీతి కంపు కొడుతోంది. మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు ఆర్‌పి నుంచి సిఒల వరకు ముడుపులు ఇవ్వనిదే సంతకాలు పెట్టడం లేదు. చివరకు ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలని సంకల్పించి ఆసరా పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తే.. ఆ డబ్బులు వారి ఖాతాలో నుంచి తీసుకోవాలన్నా మహిళలు ముడుపులు ఇవ్వాల్సి ఉంది. చివరకు ప్రతి నెలా మహిళలు పొదుపు చేసుకున్న డబ్బులను వారి ఖాతాలో నుంచి తీసుకోవాలనుకున్నప్పటికీ ఆర్ పి, సిఒలు సంతకం పెట్టాల్సిందే. దానికి వారికి ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందంటే ఇక్కడ అవినీతి ఎంత పెద్ద ఎత్తున జరుగుతోందో అర్థమవుతుంది.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో ఒక విభాగం అయిన మెప్మాలో అవినీతి రాజ్యమేలుతోంది. పెద్ద ఎత్తున కమీషన్ల పర్వం సాగుతోంది. పొదుపు మహిళలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రత్యక్షంగా కొందరు ఆర్పీలు వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నప్పటికీ ఆ శాఖలోని అందరికీ వాటాలు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో మెప్మా పరంగా మొత్తం 25,550 పొదుపు గ్రూపులు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 మంది సభ్యులు ఉంటారు. కొన్ని గ్రూపులు కలిపి సమాఖ్యలుగా ఉంటాయి. ఆయా గ్రూపుల సభ్యుల నుంచి ఆర్పీ (రీసోర్స్ పర్సన్)లను ఎన్నుకుంటారు. మొత్తం 81 మంది ఆర్పీలు ఉన్నారు. వీరిని ఐదుగురు సిఒలు (కమ్యూనిటీ ఆర్గనైజర్స్) పర్యవేక్షిస్తున్నారు. మహిళలు రెండు రకాలుగా పొదుపు చేసుకుంటారు. ఈ పొదుపులో నుంచి అవసరం మేరకు ఆ సంఘంలో తీర్మానం చేసుకుని రుణాలు తీసుకుని, వారు ప్రతి నెలా చెల్లిస్తారు. దీనికి సైతం సిఒలు సంతకం పెట్టాలన్న

ముడుపులివ్వందే సంతకాలు పెట్టని వైనం
ప్రక్షాళన చేయకుంటే తిరుగుబాటు తప్పదు

నిబంధనలు పెట్టి మహిళలను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఆయా సంఘాల వద్దకు వెళ్లి తీర్మానాలను రాయాలన్న నిబంధనలు ఉన్నాయి. అయితే వాటిని సిఒలు తుంగలో తొక్కి నిత్యం మహిళలను మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. రంజాన్ మాసంలో ముస్లిం మహిళలు వారి పొదుపు ఖాతాలో నుంచి కాస్త రుణం తీసుకోవాడానికి ఉపవాస దీక్షలో సైతం గంటల తరబడి సిఒల సంతకం కోసం వేచి ఉండాల్సిన పరిస్థితిని హిందూపురంలో చవిచూశారు. అంత సేపు వేచి ఉన్నా వారు సంతకాలు పెడతారన్న భరోసా సైతం ఉండదు. సిఒలు సంతకాలు పెట్టకుండా ఎంతో మందిని తిరిగి వెనక్కు పంపిన సంఘటనలు ఉన్నాయి.

ప్రతి రుణానికి కమీషన్ ముట్టజెప్పాల్సిందే..

ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆసరా పథకం కింద మూడో సారి ఆయా మహిళా సంఘాలకు నిధులు జమచేసింది. ఈ నిధులు పొదుపు ఖాతా నుంచి సభ్యుల ఖాతాకు బదిలీ చేయడానికి తీర్మానం రాయాలని.. దీనికి ఆర్‌పిలు ఒక తీర్మానానికి రూ.200 తీసుకుంటున్నారు. అంటే హిందూపురం పురపాలక సంఘంలో 1699 సంఘాలకు ఆసరా మంజూరు చేశారు. ఒక సంఘానికి రూ.200లతో రూ.3.39 లక్షలు ఒక్క ఎప్రిల్ నెలలో జరిగింది. దీంతో పాటు ఒక్క పొదుపు సంఘానికి రూ.లక్ష రుణం మంజూరు అయితే సిఒకు రూ.1000 కమిషన్ ఇవ్వాల్సిందే. ఇలా ప్రతి రుణంలోనూ సిఒలకు, ఆర్‌పిలకు కమిషన్లు ముట్ట చెప్పాల్సిందే. లేని పక్షంలో సిఒలు సంతకాలు పెట్టరు.

ఆర్‌పిల ఇష్టారాజ్యం..

ప్రభుత్వపరంగా అమలయ్యే పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత ఆర్‌పిలదే. బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణం మంజూరులో వారు సహాయపడాలి. అలాగే గ్రూపు సభ్యులు తీసుకున్న స్త్రీ నిధి తదితర రుణాలకు సంబంధించి తిరిగి చెల్లింపులు సకాలంలో చేయించాలి. అయితే కొందరు ఆర్పీలు సిఒల సహకారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రుణాల మంజూరు సమయంలో చేతివాటం చూపుతున్నారు. కమీషన్ల రూపేణా లబ్ధిదారుల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ. లక్ష రుణానికి రూ.1000 చొప్పున కమీషన్ నిర్ణయించి బహిరంగంగానే వసూలు చేస్తున్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగి పనులు చేయిస్తున్నాం కదా.. ఖర్చులు ఉంటాయి.. అందుకే కమీషన్ అంటూ లబ్ధిదారుల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. హిందూపురం పురపాలక సంఘంలో 25,550 సంఘాలు ఉన్నాయి. ఇందులో దాదాపు నెలకు 1000 సంఘాలకు పైగా రుణాలను తీసుకుంటారు. ఈ లెక్కన నెలకు రూ.10 లక్షల అవినీతి జరుగుతోంది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎటువంటి విచారణ చేపట్టక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వసూలు చేసిన సొమ్ములో అందరికీ భాగం ఉండటం వల్లనే మిన్నకుంటున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. లేని పక్షంలో మహిళలు ఆర్‌పిలకు, సిఒలకు వ్యతిరేకంగా తిరగబడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



తిమ్మాపురంలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీవో ఎన్. బాలాజీ నాయక్

'గురుకులం' ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ఐదో తరగతికి 9099 మంది, ఇంటర్మీడియట్‌కు 3583 మంది విద్యార్థులు హాజరు
పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీసీవో బాలాజీ నాయక్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో నడుపబడుతున్న డా. బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతి, కళాశాల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు జరిగిన ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు 10,041 మందికి గాను 9099 మంది విద్యార్థులు హాజరయ్యారు. 942 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుండి 4:30 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షకు 4228 మందికి గాను 3583 మంది హాజరయ్యారు. 647 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మెడికల్ సిబ్బంది మందులతో అందుబాటులో ఉన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు, తదితర వసతులు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఆయా మండల ఎంఆర్‌ఒలు, డిటిలు సిట్టింగ్ స్క్వాడ్స్‌గా వ్యవహరించారు. డిసిఒ ఎన్.బాలజీ నాయక్ తిమ్మాపూరం, మరికొన్ని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరగడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు, ఉద్యోగులకు డీసీవో కృతజ్ఞతలు తెలియజేశారు.

సీనరేజ్ రుసుము తప్పనిసరి

నూతన విధానం వల్ల రూ.4 కోట్ల ఆదాయం
గనులు, భూగర్భశాఖ ఉపసంచాలకులు యంపరాల నాగయ్య





ప్రజాశక్తి-అనంతపురం

తరతరాలుగా పకృతి సంపద దోపిడీకి గురవుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా, చట్టాలు ఉన్నా, అధికారుల అండతో, పలుకుబడితో కొందరు ప్రకృతిని కొల్లగొడుతూనే ఉన్నారు. కనిపించని ఈ దందా రూ.కోట్లలో సిరులు అందిస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం పేరుతో సీనరేజ్ రుసుము బాధ్యతను గుత్తేదారులకు అప్పగించింది. దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలను నివృత్తి చేయటానికి గనులు మరియు భూగర్భశాఖ ఉపసంచాలకులు యంపరాల నాగయ్య ప్రజాశక్తికి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : సీనరేజ్ అంటే ఏమిటి? ఎందుకు చెల్లించాలి ?

జవాబు : సీనరేజ్ అంటే పన్ను. ప్రకృతి వనరులను కాపాడుకోవటానికి, విచ్చలవిడి వ్యాపారం, రవాణాకు అడ్డుకట్ట వేయటానికి ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. ఈ సీనరేజ్ విధానం చెల్లించిన తరువాతనే తవ్వకాలు, రవాణా జరగాలి. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ సీనరేజ్ చెల్లించి రవాణా చేయాలి. ఎవరికీ మినహాయింపు లేదు.

ప్రశ్న : ప్రస్తుతం ఈ విషయంపై పలు అపోహలు వినబడుతున్నాయి. మీరేమంటారు ?

జవాబు : వాస్తవమే. కాని అవి అపోహలు మాత్రమే. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయల్సిన బాధ్యత అధికారులకు ఉంటుంది. నిబంధనలను కఠినతరం చేయటం వల్ల ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రశ్న : గనులు, భూగర్భ శాఖ నుండి సీనరేజ్ బాధ్యత ప్రయివేటు వారికి అప్పగించారా ?

జవాబు : అవును..2023 మార్చి 3వ తేది నుండి అమిగోస్ మినరల్స్ సంస్థ మట్టి, మినరల్స్ సీనరేజ్ రుసుము బాధ్యతలను ఈ-టెండరు ద్వారా దక్కించుకుంది. అప్పటి నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గనులు, భూగర్భ శాఖతో కలిసి ఆ సంస్థ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకుంటోంది. ముఖ్యంగా ఈ సంస్థ మట్టి, మినరల్స్‌ను సీనరేజ్ లేకుండా రవాణా చేయనివ్వదు.

ప్రశ్న : ప్రయివేటు సంస్థకు ఎప్పటి వరకు బాధ్యలు ఇచ్చారు ?

జవాబు : రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి చిన్న తరహా ఖనిజాల సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టును ఈ-యాక్షన్ ద్వారా అమిగోస్ మినరల్స్ సంస్థకు రెండు సంవత్సరాల కాలపరిమితికి గాను కాంట్రాక్టు ఇచ్చింది. కాంట్రాక్టరు రుసుముగా సుమారు రూ.259 కోట్లు నిర్ధారించింది. ఈ క్రమంలో ప్రతి నెలా కాంట్రక్టరు రూ.10,79,58,333 కోట్లు ముందుగా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలి.

ప్రశ్న : నూతన విధానం వల్ల ప్రయోజనం ఉందా ?

జవాబు : ఈ విధానంతో ప్రభుత్వానికి ప్రతి నెలా అక్షరాల రూ.3.99 కోట్లు ఆదాయం వస్తోంది. గతంతో పోల్చితే కారణాలు ఏమైనా ప్రకృతి సపదను కొల్లగొట్టేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఉండవు. దీంతో అక్రమంగా తరలించే అవకాశాలు పూర్తిగా మూసుకుపోవటంతో ప్రకృతి సంపదను కాపాడుకోవచ్చు.

ప్రశ్న : గుత్తేదారులు ఎలాంటి పనులు చేయాలి ?

జవాబు : అక్రమ రవాణాను అదుపు చేసేందుకు ప్రభుత్వ ఆదాయాన్ని పక్కదారి పట్టనీయకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి గనులు, భూగర్భ శాఖ గుర్తింపు పొందిన ప్రయివేటు సిబ్బందిని నియమించుకుని ఖనిజ రవాణా వాహనాలను తనిఖీ చేయాలి. మట్టి, కంకర వంటి మినరల్స్ సీనరేజ్ చెల్లించకుంటే కట్టించాలి. లేకుండా రవాణా చేస్తే వాహనాలను ఆపి అధికారుల దృష్టికి తీసుకురావాలి.

ప్రశ్న : సీనరేజ్‌ను పెంచటంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. దీనికి మీ సమాధానం ?

జవాబు : రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు కాంట్రాక్టరుకు బాధ్యతలను అప్పగించినా గతంలో ఉన్న సీనరేజ్ రుసుము ఒక్క రూపాయి కూడా పెంచలేదు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్ణయించిన సీనరేజ్ రుసుమును మాత్రమే గుత్తేదారులు వసూలు చేయాలి. అదనంగా ఎలాంటి డబ్బు వసూలు చేయకూడదు. తదుపరి చర్యలు తీసుకునే బాధ్యత కూడా ప్రభుత్వ అధికారులకు మాత్రమే ఉంటుంది. గుత్తేదారులు పరిశీలకులుగా ఉంటారు. సమస్యలు వచ్చినప్పుడు అధికారులకు తెలియచేస్తారు. తదుపరి నిర్ణయం మేరకు అపరాధ రుసుము గనులు, భూగర్భ శాఖ అధికారులు నిబంధనల మేరకు నిర్ణయిస్తారు.

ప్రశ్న : ప్రకృతి వనరులకు సీనరేజ్ తప్పని సరిగా చెల్లించాలా ?

జవాబు : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రకృతి.. అందులో భాగమైన భూమిలో దొరికే అన్ని ఖనిజాలకు సీనరేజ్ రుసుమును వసూలు చేస్తారు. గతంలో గనుల శాఖ అధికారులు ఇదే క్రమంలో చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత ప్రయివేటు వారికి అప్పగించిన తరువాత ఇదే అమలవుతోంది. అయితే సిబ్బంది లోటు కారణంగా అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయం కారణంగా ఒక విధంగా ప్రకృతి కాపాడబడడంతో పాటు ప్రభుత్వానికి రాబడి పెరిగింది.

ప్రశ్న : సీనరేజ్ విషయంలో మినహాయింపులు ఉన్నాయా ?

జవాబు : ప్రభుత్వ విధానం, జీవో 100 నిబంధనల ప్రకారం చట్టం నుండి ఎవ్వరికీ మినహాయింపు లేదు. సీనరేజ్ కట్టిన తరువాతనే ఖనిజం తవ్వకం రవాణా జరగాలి. ప్రభుత్వ సంబంధిత పనులకు, కమర్షియల్ వెంచర్లకు ప్రభుత్వం నిర్ణయించిన సీనరేజ్ చెల్లించాలి. ఏవైనా సీనరేజ్ విషయంలో మినహాయింపులు ఉంటే ఆ పత్రాలను అధికారులకు ముందుగా చూపాలి. నిబంధనలు తప్పనిసరి.

ప్రశ్న : అధికారులపై రాజకీయ ఒత్తిడి ఉందా ?

జవాబు : ఎలాంటి ఒత్తిడి లేదు. అయితే గతం నుండి ప్రకృతి వనరుల విషయంలో ఉదాసీనత ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో అనేక కేసులు పెట్టాం. ప్రస్తుతం నూతన విధానం వల్ల ప్రకృతి వనరులను కొల్లగొట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులుగా మాపై ఉంది. ఇది సామాజిక బాధ్యత కూడా. అవసరం మేరకే ప్రకృతిని వినియోగించుకోవాలి. వ్యాపారం చేస్తే తప్పకుండా సీనరేజ్ చెల్లించాలి. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. పాలకుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తు న్నాం. అందరూ సహకరిస్తున్నారు. సమిష్టిగా, సామాజిక బాధ్యతగా ప్రకృతిని కాపాడుకోవటంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పక్కదారి పట్టకుండా చూస్తున్నాం.



నిరసన తెలుపుతున్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ సభ్యులు

జీవో 52ను ఉపసంహరించుకునే వరకు పోరాటం

గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద ఎఐబిఎస్ఎస్ నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బోయ, వాల్మీకి, బెంతో, ఒరియా కులాల వారిని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 52 జీవో ఉపసంహరించుకునేంత వరకు గిరిజనులు ఐక్యంగా పోరాటాలు చేస్తారని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా గౌరవాధ్యక్షులు సి.అశ్వర్థ నాయక్ అన్నారు. ఆదివారం ఎఐబిఎస్-ఎస్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహించారు. టవర్ క్లాక్ నుంచి చేపట్టిన ర్యాలీని అశ్వర్థ నాయక్ ప్రారంభించారు. మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి సప్తగిరి సర్కిల్ మీదుగా జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఐబిఎస్ఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు అశ్వర్థ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల పక్షపాతి ప్రభుత్వం అని చెబుతూనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరో వందేళ్లు గిరిజనులను వెనక్కి నెట్టేలా ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తున్నారని విమర్శించారు. అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకి, బెంతో వరియాలను ఎస్టీ జాబితాలో చేర్చి తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేయడం సరికాదన్నారు. వాల్మీకి బోయల మీద ప్రభుత్వానికి నిజంగా ప్రేమ ఉంటే వారికి ప్రత్యేక రిజర్వేషన్ కల్పించి, ప్రత్యేక నిధులను కేటాయించి అభివృద్ధి చేస్తే మంచిదే అన్నారు. దీనిని గిరిజనులు కూడా స్వాగతిస్తారని తెలిపారు. అలా కాదని వారిని ఎస్టీ జాబితాలో చేరుస్తామంటే తాము ఒప్పుకునేది లేదన్నారు. 33 ఉప కులాలు ఉన్న ఎస్టీ రిజర్వేషన్‌లో దామాషా ప్రకారం రిజర్వేషన్ పెంచాలని తాము అడుగుతున్న తరుణంలో ఇతరులను చేర్చి తమకు అన్యాయం చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. గిరిజనులకు ఇంత అన్యాయం జరుగుతున్నా మాట్లాడటానికి ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అన్ని విధాలుగా వెనుకబడిన గిరిజనులు ఇప్పుడిప్పుడే అభివృద్ధి ఫలాలను అందుకుంటున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ఏకపక్షంగా ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి గిరిజనుల అభివృద్ధిని అడ్డుకోవడం అన్యాయం అన్నారు. సంక్షేమం, హక్కుల కోసం ఏనాడూ గిరిజనులు ఇలా రోడ్లెక్కిన పరిస్థితి రాలేదన్నారు. తమకు రక్షణగా ఉన్న ఏకైక ఎస్టీ రిజర్వేషన్‌లో ఇతరులను చేర్చి నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుండట ఆందోళనకరంగా ఉందన్నారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి పునరాలోచించాలన్నారు. నిజంగా గిరిజనులు ఆ పార్టీకి కావాలనుకుంటే తక్షణమే 52 జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుత పోరాటాలతో ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా బంజారా సేవా సంఘ్ అనంతపురం జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ గౌరవ సలహాదారులు హెచ్.శేఖర్ నాయక్, ఉపాధ్యక్షులు ప్రసాద్ నాయక్, కిరణ్‌కుమార్ నాయక్, వెంకట నాయక్, ధర్మసింగ్ నాయక్, నగర సభ్యులు కుమార్ నాయక్, మహిళా అధ్యక్షురాలు సుగుణ బాయి, చంద్రీబాయి, మహిళా సభ్యులు ఈశ్వరి బాయి, రచయిత ఎస్ఎన్.కృష్ణా నాయక్, కమిటీ సభ్యులు నరేష్ నాయక్, పిక్లా నాయక్, నారాయణ నాయక్, చాంప్లా నాయక్, సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీలో పాల్గొన్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, నాయకులు

ప్రభుత్వం దృష్టికి గురుకులాల సమస్యలు

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప
కెవిపిఎస్, అప్పా ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప తెలిపారు. గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గురుకుల పాఠశాల, నార్పల మండలం బి.పప్పూరు గురుకుల పాఠశాల, గుత్తి మండలం రజాపురం గురుకుల పాఠశాలల వద్ద కెవిపిఎస్, ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పేద విద్యార్థులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం కెవిపిఎస్, అప్పా కమిటీలు సంయుక్తంగా మంచినీరు, మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు అరటిపండ్లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. అంబేద్కర్ చెప్పినట్టు అధ్యయనం, సమీకరించడం, ఉద్యమించడం అనే లక్ష్యాలను కెవిపిఎస్, అప్పా కమిటీలు కొనసాగిస్తున్నాయన్నారు. భవిష్యత్తులో గురుకుల పాఠశాలల్లో నెలకొన్న వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ముఖ్యంగా విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, బెడ్‌షీట్లు, కాస్మొటిక్ ఛార్జీల వంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొర్రపాడు గురుకుల పాఠశాలల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బంగి ఓబుళపతి, ఎస్సీ, ఎస్టీ ఫోరం సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెరమెట్ల యల్లన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.భాస్కర్, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, నెట్టికంటయ్య, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర బోధనలను తప్పక పాటించాలి

జయంతి సభలో విప్ కాపు రామచంద్రారెడ్డి



బసవేశ్వరస్వామి జయంతి సభలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బసవేశ్వర బోధనలను తూచా తప్పకుండా పాటించాలని విప్, అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలో బసవేశ్వరస్వామి చిత్రపటాన్ని మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. శ్రీ పేట బసవేశ్వరస్వామి ఆలయం నుంచి సప్తగిరి సర్కిల్, లలిత కళాపరిషత్, టవర్ క్లాక్ మీదుగా శ్రీకృష్ణ కళామందిర్ వరకూ ఊరేగింపు సాగింది. అక్కడ సమీపంలోని బసవేశ్వర స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం కృష్ణ కళామందిరంలో ఏర్పాటు చేసిన సభలో విప్ కాపు మాట్లాడుతూ బసవేశ్వర బోధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ముఖ్యంగా కష్టపడి పని చేయాలని, శ్రమకుతగ్గ ఫలితం అనుభవించాలని, పదిమందికి సహాయం చేయాలని బసవేశ్వర స్వామి సూచించారన్నారు. ఆయన బాటలోనే సిఎం జగన్ నడుస్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వసతి దీవెన, విద్యాదీవన, అమ్మఒడి తదితర పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ సమాజంలో సమానత్వాన్ని, సంస్కరణలను తీసుకురావాలని పోరాటం చేసిన వారిలో బసవేశ్వరుడు చిరస్మరణీయులు అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అప్పట్లో బీసీ వర్గానికి చెందిన లింగాయత్‌లకు గుర్తింపును తీసుకొచ్చి వివక్షను అంతం చేసేందుకు కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, విద్యతోనే సమాజంలో మార్పు తీసుకు రాగలుగుతామని అప్పట్లోనే విద్యకు పెద్దపీట వేసి లింగాయత్‌లను సమన్వయం చేసుకుంటూ వారికి సమాజంలో గౌరవమైన స్థానాన్ని తీసుకోవాలని ఎంతగానో పోరాడిన వ్యక్తి బసవేశ్వరుడు అని కొనియాడారు. ఆయన బాటలోనే ప్రతి ఒక్కరు నడవాలన్నారు. ఇందులో భాగంగానే ఈబీసీల కోసం ఈబీసీ నేస్తం పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. అలాగే నాడు – నేడు కింద ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ కళాశాలకు దీటుగా అభివృద్ధి చేయడంతోపాటు హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు వివరించారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖుల్లో బసవేశ్వరుడు ఒకరని ప్రశంసించారు. ఆయనను బసవన్న, బసవుడు అని, విశ్వగురు అని కూడా పిలుస్తారన్నారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని, లింగాయత ధర్మం స్థాపించారన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త బసవేశ్వరుడి జయంతిని సిఎం జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. బసవేశ్వరుడు 800 సంవత్సరాల క్రితమే కుల,వర్ణ, లింగ బేధాలు లేవని, అందరం సమానమేనని చాటి చెప్పారన్నారు. సమ సమాజ స్థాపనకు ఆయన ఎంతగానో కృషి చేశారని, ఆయన బోధనలు, వచనాలు ఈ తరానికి ఎంతోఅవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా వీర శైవ సమాజ అధ్యక్షులు ఎంజి.రాజు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్,కోశాధికారి మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద ముష్టూరులో పైపులైన్ లీకేజీ

కలుషితమవుతున్న తాగునీరు.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ఉరవకొండ



పైపులైన్ లీకేజీ కావడంతో కలుషితమైన తాగునీరు

మండల పరిధిలోని పెద్ద ముష్టూరులో ఉన్న తాగునీటి ట్యాంకు సమీపంలో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. లీకేజీ ఏర్పడి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పైప్‌లైన్ లీకేజీ కారణంగా అరకొరగా నీరు సరఫరా కావడంతోపాటు కలుషితం అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు తాగడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కావున ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పైప్‌లైన్ లీకేజీని అరికట్టి నీటి వృధాను అరికట్టడంతోపాటు నీరు కలిషితం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సిఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి-నార్పల



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ముఖ్యమంత్రి జగన్ నార్పల పర్యటన ఏర్పాట్లు మళ్లీ మొదలయ్యాయి. వసతి దీవెన పథకం ప్రారంభానికి ఈనెల 17న సిఎం నార్పలకు రావాల్సి ఉండగా ఏర్పాట్లు పూర్తయిన తర్వాత ఆఖరి సమయంలో రద్దయిన విషయం తెలిసిందే. అయితే తిరిగి ఈనెల 26న సిఎం పర్యటన రానున్న నేపథ్యంలో మళ్లీ అధికారుల సందడి మొదలైంది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్‌డిఒ మధుసూదన్, డీఎస్పీ, స్థానిక అధికారులతో కలిసి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. గూగూడు రోడ్డు నుంచి సభా స్థలి క్రాసింగ్ వరకు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ బాలల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ లక్ష్మీనరసింహా, శింగనమల సిఐ అస్రార్‌బాషా, ఎస్ఐ ఈశ్వరయ్య, ఆర్ఐ సందీప్, మేజర్ పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, విఆర్ఒలు రామకృష్ణ, వంశీకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి రోజులు దగ్గరపడ్డాయి

వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య

ప్రజాశక్తి-తాడిపత్రిరూరల్

ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. ఆదివారం తాడిపత్రి రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ప్రకటించిన టైమ్స్ నౌ ప్రీ పోల్స్ సర్వేలో వచ్చే ఎన్నికల్లో 25 ఎంపీ సీట్లను వైసిపి గెలుచుకుంటుందని చెప్పడం హర్షణీయమన్నారు. దీన్ని బట్టి చూస్తే అసెంబ్లీ ఎన్నికల్లో 175 సీట్లు వైసిపి గెలవడం ఖాయమనిపిస్తోందన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్న ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. ముఖ్యంగా ఎలాంటి సిఫారసులు, లంచాలు లేకుండానే వాటిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు వేయడం ద్వారా పారదర్శకపాలన సాగిస్తున్నారన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలందరికీ మంచి చేసిన నాయకుడిగా మన్ననలు పొందుతున్నాడన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు నీరు–చెట్టు, జన్మభూమి కమిటీలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అమరావతి రాజధాని నిర్మాణం వంటి వాటిల్లో అంతులేని అవినీతికి పాల్పడ్డారన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో తమను ఆదరించరన్న అక్కసుతోనే లోకేష్‌తో పాదయాత్ర చేయిస్తున్నారన్నారు. లోకేష్ కూడా పాదయాత్రలో తమను గెలిపిస్తే ఏం చేస్తామో చెప్పకుండా కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులు, సిఎంను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అందుకే ప్రజలు కూడా మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్తు నువ్వే జగన్ అంటున్నారన్నారు. ఇప్పటికే ఇంటింటికీ చేపడుతున్న మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, వాలంటీర్లు గ్రామాల్లోకి, వార్డుల్లోకి వెళుతుంటే ప్రజలు ఆదరిస్తున్న తీరు హర్షణీయమన్నారు. ఇళ్లకు ముఖ్యమంత్రితో చిత్రంతో కూడిన స్టిక్కర్లను అంటించాలనడంతో పాటు మిస్డ్ కాల్ ద్వారా వారికి పార్టీ, ముఖ్యమంత్రిపై ఉన్న నమ్మకాన్ని చూపుతున్నారన్నారు.

ఏ మొహం పెట్టుకుని జిల్లాకొస్తున్నావ్ జగన్‌రెడ్డీ?

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు

ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు ఇచ్చినపుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు గాలికి వదిలేసి 'మాట తప్పి మడమ తిప్పిన' జగన్‌రెడ్డి ఏముఖం పెట్టుకుని జిల్లాకు వస్తున్నావని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం అయిన తర్వాత తొలిసారిగా అనంతపురం వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హంద్రీనీవా కాలువలును వెడల్పు చేసి ఐదువేల క్యూసెక్కులకు, మరో సమాంతర కాలువ ద్వారా ఇంకొక 5 వేల క్యూసెక్కుల నీటిని హంద్రీనీవా నుంచి జీడిపల్లికి తీసుకొస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే హామీ ఇచ్చి నాలుగేళ్లు గడచినా ఇప్పటికీ కాలువ గట్టుపై పెరిగిన కంపచెట్లను తొలగించలేదని ఎద్దేవా చేశారు. అలాగే తుంగభద్ర హెచ్‌ఎల్‌సిని ఆధునీకరణ చేస్తామని చెప్పి విస్మరించారన్నారు. అదేవిధంగా అనంతపురం ఉమ్మడి జిల్లాలో 3.5లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పిల్ల కాలువలు ఏర్పాటు చేస్తామని నమ్మం పలికినా కార్యరూపం దాల్చలేదన్నారు. వీటితోపాటు అనేక హామీలు ఇచ్చారన్నారు. వీటిలో కనీసం సగం కూడా అమలు చేయని సిఎం ఈనెల 26న తిరిగి జిల్లాకు ఎలా వస్తున్నాడని ప్రశ్నించారు. కాగా ఈనెల 26న గుంతకల్లులో మోడీకి హటావో దేశ్ కి బచావో అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఆరోజు పాత గుంతకల్లు నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

- సెమీస్ చేరిన గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం జట్లు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



హాకీ పోటీలో తలపడుతున్న సత్యసాయి జిల్లా, విశాఖపట్నం జిల్లా క్రీడాకారులు

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 13వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ బాలుర హాకీ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం జట్లు సెమీఫైనల్ చేరాయి. టోర్నీలో భాగంగా మూడవ రోజైన ఆదివారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కడప, అనకాపల్లి జట్లు తలపడగా 1–0 గోల్స్ తేడాతో వైఎస్ఆర్ కడప జట్టు విజేతగా నిలిచింది. మరో పోటీలో గుంటూరు, కాకినాడ మధ్య మ్యాచ్ జరగ్గా డ్రా అయింది. విశాఖపట్నం తల పడగా 1–0తేడాతో విశాఖపట్నం జటు. విజేతగా నిలిచింది. ప్రకాశం, విజయ నగరం జట్లు మధ్య జరిగిన పోటీలో విజయనగరం జట్టు 0–5 గోల్స్ తేడాతో విజయం సాధించింది. అనంతపురం, తిరుపతి జట్ల మధ్య పోటీ డ్రా అయిందని హాకీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బంధ నాధం సూర్యప్రకాశ్ తెలిపారు. దీంతో గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం జట్లు సెమీ ఫైనల్ చేరుకొన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా జీజీఎఫ్ కార్యదర్శి అంజన్న, హాకీ అసోసియేషన్ ప్రతినిధులు ఉడుముల రామ చంద్ర, హసీన్, చందు, అరవిందగౌడ్, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు

వేగవంతంగా అభివృద్ధి పనులు

సర్పంచి గీతమ్మ, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న విడపనకల్లు జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కింద మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేస్తామని హావలిగి సర్పంచి ఈతమ్మ, విడపనకల్ జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సచివాలయం–1 పరిధిలో చేపట్టిన పనులను ఆదివారం పరిశీలంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు 1వ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈనిధుల్లో రూ.5లక్షలతో గ్రామంలో తాగునీటి వసతి ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన రూ.15 లక్షలతో ఎస్సీ, బీసీ కాలనీల్లో సిసి రోడ్లు వేయిస్తున్నామన్నారు. విశ్వేశ్వరరెడ్డి, యువనేత ప్రణయ్‌రెడ్డి సహకారంతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వీటిలో కొన్ని పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆయా వార్డుల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పరిశీలిస్తున్నామని, వెంటనే పూర్తి చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు కళావతి, రాజమ్మ, వైసిపి నాయకులు రఘురాములు, రాజశేఖర్, మడకశిర, స్వామి, మల్లప్ప, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

ప్రజాశక్తి-గుత్తి



మాట్లాడుతున్న రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ వై. రాజశేఖర్‌రెడ్డి

రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ వై. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పుస్తకాల చదవడం వల్ల మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్య లో భాగంగా పుస్తకాలు చదవాలని కోరారు. పుస్తకాలు, పత్రికలు చదవడం చిన్ననాటి నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ద్వారానే మాతభాషపై పట్టు సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు జ్ఞానేశ్వర్ రావు, హరి ప్రసాద్, కోటేశ్వరరావు, గ్రంథాలయాధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బసవేశ్వర జయంతి

ప్రజాశక్తి-గుత్తి



బసవేశ్వర జయంతిలో పాల్గొన్న మాజీ ఎంపిపి కోనా, తదితరులు

పట్టణంలో ఆదివారం బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా బసవేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. జయంతి వేడుకలు కు మండలంలోని వీరశైవులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కోనా ప్రతాపరెడ్డి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ గవర్నర్ విరుపాక్షిరెడ్డి, బసవ మిషన్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ చౌదరి విజయభాస్కర్, శివకుమార్, నాగేంద్రప్ప, శంకర్, బర్మా శివన్న, చిన్న, నాగరాజు, యాగంటప్ప, బలిజ సంఘం నాయకులు ఉబిచెర్ల శేఖర్, చిరంజీవి, దేవేంద్ర రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా 'స్పందన'

అనంతపురం కలెక్టరేట్ : కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

దానిమ్మ చెట్లకు నిప్పు..

రూ.4.50 లక్షలు నష్టం



గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయిన దానిమ్మ చెట్లు

బెలుగుప్ప : మండల కేంద్రానికి చెందిన రైతు ఎల్.గోపాల్‌రెడ్డి సాగు చేస్తున్న 20 ఎకరాల్లో ఉన్న దానిమ్మ చెట్లకు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో చెట్లుపూర్తిగా కాలిపోయి సుమారు రూ.4.50లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు బాధిత రైతు వాపోయారు. వివరాల్లోకి వెళ్తే... రైతు గోపాల్‌రెడ్డి మండల కేంద్రం సమీపంలోని 88 సర్వేనెంబర్‌లోఉన్న 20 ఎకరాల్లో 800 దానిమ్మ చెట్లు సాగు చేశారు. ఇందుకోసం సుమారు 4లక్షలకు పైగా పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిబూడిదైనట్లు వాపోయాడు. దీనికితోడు 60 కట్టలు డ్రిప్ వైర్లు కాలినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గమణించిన స్థానికులు అగ్నిమాపక యంత్రానికి సమాచారం అందించడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా రైతు గోపాల్ రెడ్డి కుమారుడు ఓపిరెడ్డి మాట్లాడుతూ గతంలో కూడా కోత దశకు వచ్చిన అరటి చెట్లకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అప్పట్లో కూడా రూ.లక్షల్లో నష్టపోయామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు.

శింగనమలలో గడ్డివామికి...



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

శింగనమల : మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో ఉన్న గడ్డివామికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలి బూడిదైంది. రైతు కాయల సూరికి చెందిన గడ్డివామి కాలిపోవడంతో సుమారు రూ.2లక్షల వరకూ నష్టం వాటిల్లింది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు... సూరి తనకున్న ఐదెకరాల్లో సాగు చేసిన వరిగడ్డిని పశువుల మేత కోసం ఏర్పాటు వామిగా ఏర్పాటు చేసుకున్నాడు. ఈనేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమణించిన స్థానికులు వెంటనే ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన హరిప్రసాద్ పెద్దవడుగూరుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా గుత్తి–అనంతపురం గ్రామ మలుపు సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని 108 వాహనం లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైకును ఢీకొన్న కారు.. దంపతులకు గాయాలు

బత్తలపల్లి : అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి ముందు ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండల పరిధిలోని చియ్యేడుకు చెందిన ఆదినారాయణ, వెంకటలక్ష్మీ దంపతులు ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బ మండలంలోని ముక్తాపురం గ్రామానికి వెళ్లి తిరుగు పయణమయ్యారు. వీరు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి ముందు వెళ్తుండగా కదిరి వైపు నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న కారు వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దెబ్బతిన్న అరటి పంట

ముదిగుబ్బ : ముదిగుబ్బ మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో గుంజేపల్లి గ్రామంలో రైతు వీర నారప్పకు రూ. 4 లక్షల పంట నష్టం వాటిల్లింది. ఆయన రెండెకరాల్లో పంట సాగు చేయగా ఈదురుగాలుల ధాటికి అరటి చెట్లు నేలకొరిగాయి. పంట చేతికందే సమయంలో చెట్లు కూలిపోవడంతో రూ. 4 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు, తోటి రైతులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి దంపతులకు అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా టిడిపి శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచే నగరంలోని ప్రభాకర్‌చౌదరి నివాసానికి టిడిపి శ్రేణులు భారీగా తరలివచ్చి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో పెద్దపేట గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్, కుటుంబ సభ్యులు ఆదివారం అన్నదానం చేసినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. తమకు అన్నదానం చేసిన బాబా ఫక్రుద్దీన్ కుటుంబ సభ్యులు నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో ఉండాలని వృద్ధులు దీవించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఉదయం 5వ తరగతికి సంబంధించి 783 మందికి 686 మంది, మధ్యాహ్నం నిర్వహించిన జరిగిన ఇంటర్ పరీక్షలకు 404 మంది హాజరవ్వాల్సి ఉండగా 382 మంది హాజరైనట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఉరవకొండ : ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎఐటియుసి ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు నెలకు రూ.18వేల గౌరవవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కావున ఈ ధర్నాకు నియోజకవర్గంలోని ఆశావర్కర్లతో పాటు జిల్లావ్యాప్తంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.